www.prajasakti.com

# ప్రజాశక్తి

బుధవారం 9 జులై 2025





## హనుమంత వాహనంపై ఊరేగిన సౌమ్యనాథుడు

**ప్రజాశక్తి - నందలూరు:** శ్రీసౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి హనుమంత వాహనంపై శ్రీసౌమ్యనాథ స్వామి ఆసీనులై శ్రీరామచంద్రుని అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ గ్రామోత్సవం సందరంగా, పేటగడ్డ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా బస్టాండ్ కూడలి వరకు కొనసాగింది. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథ స్వామి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో సూపరిం టెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం శేషవాహనం, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రి గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.





# సార్వత్రిక సమ్మెకు సర్వం సిద్ధం

### ప్రజా సంఘాల సన్నాహాలు
### రోడ్డెక్కనున్న కార్మికులు, స్కీమ్ వర్కర్లు

**జిల్లాలో సార్వత్రిక సమ్మెకు సర్వం సిద్ధమైంది. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సహా పలు వామపక్ష, కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్మికులు, కర్షకులు, విద్యార్థి, యువజన, సంఘాలన్నీ ఒక్కతాటిపై ముందుకు కదులుతున్నాయి. బుధవారం దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు సంఘీభావం ప్రకటించడం తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కీలక కూడళ్లు, ప్రభుత్వ, పరిశ్రమల ఎదుట భారీ ర్యాలీలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనల నిర్వహణకు కార్మిక, కర్షకలోకం సర్వం సిద్ధం చేసిన నేపథ్యం కార్మిక, కర్షక, శ్రమజీవుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.**

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జిల్లాలో కార్మికుల నిరసనాగ్రహం పెల్లుబికుతోంది. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల పట్ల కార్మికులు కన్నెర్ర చేస్తున్న సంగతి తెలిసిందే. కార్మిక సంఘాల చట్టం-1926లోని 29 చట్టాలను కుదించి నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చడం దగ్గర నుంచి ఎనిమిది గంటల పనిదినాన్ని 10 గంటల నుంచి 14 గంటల వరకు పెంచడం, స్కీమ్‌వర్కర్ల కనీస వేతనం అమలుపై కార్మిక, కర్షక, శ్రామిక సంఘాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వామపక్ష కార్మిక, కేంద్ర కార్మిక సంఘాలన్నీ కలిసి సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. బుధవారం కడప, అన్నమయ్య జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా లక్షలాది మంది కార్మిక, కర్షకలోకం రోడ్డెక్కుతోంది. కేంద్రం ఇటీవల తెచ్చిన కార్మిక, కర్షక వినాశకర చట్టాలు, విద్యుత్ చట్టాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలోని కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల ప్రజాసంఘాలు కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసన ర్యాలీలు, ప్రదర్శనలతో హోరెత్తించనున్నాయి. బిజెపి 11 ఏళ్ల పాలనలో రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మికులు, కర్షకలోకం ముందుకు కదిలింది. పారిశ్రామిక, వ్యవసాయ వినాశకర చట్టాల ఉపసంహరణతోపాటు స్కీమ్‌వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ కదం తొక్కనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా కడప, అన్నమయ్య జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రజాసంఘాల నాయకులు బాధ్యతలు పంచుకుని సమ్మెను జయప్రదం చేయడంపై దృష్టి కేంద్రీకరించడం నిరసన తీవ్రతకు అద్దం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు ప్రజావ్యతిరేక విధానాల అమలును ఉపసంహరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

**రాజంపేట అర్బన్ :** కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సికిందర్, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఇ.శ్రీహరి పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులతో కలిసి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ పురపాలక కార్యాలయం నుంచి మొదలై పాత బస్టాండు మీదుగా ఆర్‌అండ్‌బి అతిథి గృహం వరకు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, పని గంటలు తగ్గించాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.వి.రమణ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు ఈశ్వరమ్మ, అమరావతి, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి నగేష్, మునిసిపల్ కార్మికులు ప్రసాద్, ఎం.రమణ, మధు పాల్గొన్నారు.

# వంద రోజుల పనిదినాలు కల్పించండి : కలెక్టర్

**ప్రజాశక్తి-వీరబల్లి**

గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా మొక్కల పెంపకాన్ని విస్తృతంగా చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని వంగిమల్ల గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పండ్ల మొక్కలను నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి రైతు పొలాల్లో కలెక్టర్ నిమ్మ చెట్టు నాటి రైతులను, ఉపాధి శ్రామికులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా మొక్కల పెంపకాన్ని చేపట్టడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు, గ్రామీణులకు ఉపాధి లభిస్తోందన్నారు. ఉపాధి హామీ చట్టం కింద రైతుల పొలాల గట్లపై పాటు ఖాళీగా ఉండే ప్రదేశాలలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి ఉపాధి శ్రామికులకు వంద రోజుల పని దినాలు కల్పించాలని కలెక్టర్ డ్వామా అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో మొక్కలు నాటాలన్న లక్ష్యంలో భాగంగా మంగళవారం రోజున 1500 ఎకరాల్లో ఉపాధి శ్రామికులచే మొక్కలు నాటించామని తెలిపారు. మామిడి, జీడి మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, డ్రాగన్ జామ, కొబ్బరి, సపోటా, చింత నేరేడు, అంజీరా, అవకాడో, గుంబేనీ, మల్లె తదితర మొత్తం 20 రకాల పూలు, పండ్ల మొక్కలను ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో నాటేందుకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం కల్పిస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధి శ్రామికులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పండ్ల, పూల తోటలను పెంచు కోవడం వలన రైతులకు అధిక ఆదాయం వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. మామిడి ఒకటే కాకుండా వివిధ రకాల పండ్ల మొక్కలను రైతులు పెంచుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల పని దినాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్య క్రమంలో డ్వామా పీడీ, ఎపిడి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ జవహర్‌బాబు, టిడిపి మండల అధ్యక్షులు మానుగోపాలరాజు, రైతులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని వీరపల్లి దళితవాడకు చెందిన వందాడి ప్రభాకర్ వివిధ రకాల సర్వేనెంబర్లలో తనకు చెందిన భూములను థర్డ్ పార్టీ వ్యక్తులు చుక్కల భూములకింద చూపించి ఇంటి స్థలాల ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని సంభందిత భూములపై విచారణ జరిపి న్యాయం చేయవలసిందిగా కలెక్టర్‌ను కోరిన నేపథ్యంలో కలెక్టర్ స్వయంగా పరిశీలించి సంబంధిత అర్జీ దారులతో మాట్లాడారు. ఈ విషయమై అర్జీ దారులు ఈ భూమి తనకు చెందినదని తన పూర్వీకుల నుండి ఈ భూమిలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నామని, ప్రభుత్వానికి అవసరం నిమిత్తం ప్రభుత్వ భవనాలకు ఐదు ఎకరాలు ఇచ్చామని సంబంధిత రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. సదరు భూములు ప్రభుత్వ రికార్డులలో ఆర్‌హెచ్‌లో ఆయకట్టు బంజర భూమిగా ఉన్నదని, ఇది ప్రభుత్వ భూములని కలెక్టర్ తెలిపారు. భూములకు సంబంధించి హక్కుదారుల దగ్గర ఉన్న రికార్డులను, ఆధార్ కార్డును సంబంధిత తహశీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని వాటిని పరిశీలించి సంబంధీకులకు తగు న్యాయం జరిగే విధంగా చూస్తామని తెలిపారు. రెవెన్యూ ఆధీనంలో ఉన్న భూములన్నిటికీ రక్షణ కల్పించాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.



మొక్కలు నాటుతున్న కలెక్టర్ శ్రీధర్

# ఉద్యమాల అణచివేత ధోరణి మంచిది కాదు : సిపిఎం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

**ప్రజాశక్తి - రాయచోటి అర్బన్**

ప్రజా, కార్మిక ఉద్యమాల అణచివేత ధోరణిని జిల్లా పోలీసు యంత్రాంగం అవలంభిస్తుండడం మంచి పద్ధతి కాదని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం దేశ వ్యాప్తంగా తమ హక్కుల పరిరక్షణ, దుర్మార్గమైన లేబర్ కార్డుల రద్దు డిమాండ్‌తో కార్మిక సంఘాలు నిర్వహింప తలపెట్టిన సమ్మెను ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు నిర్వీర్యం చేసేలా వ్యవహరీ స్తుండడం తగదన్నారు. ఉగ్రవాద కార్యక్రమాల నియంత్రణ పేరుతో జిల్లాలో ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలనుకునే ఆందోళనలు, నిరసనలను కాలరాయాలని చూడడం అసంబద్ధమన్నారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని సంఘాల నిర్వహిస్తున్న సమ్మెను జిల్లాలో వివిధ రకాల నియమ, నిబంధనల అమలు పేరుతో అడ్డుకోవాలని చూస్తుండడం దుర్మార్గ మన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను పోలీసులు కాలరాసేలా వ్యవ హరిస్తుండడం సరైందని కాదని తెలిపారు. నిజంగా ఎస్‌పి శాంతి, భద్రతలను పరిరక్షించాలని ఉంటే వెంటనే జిల్లాలోని అన్ని సంఘాల నేతలను సమావేశపరిచి అందరికీ చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. ఏకపక్షంగా ఆందోళనలను నిరసనలను అడ్డుకోవాలని చూస్తే ప్రజలు తిరగబడతారనే అంశాన్ని గుర్తుంచుకోవా లంటూ ఆయన సూచించారు. ప్రజల పట్ల, ప్రజాస్వామిక హక్కుల రక్షణ కోసం పోరాడే వారి పట్ల పోలీసులు సరైన పద్ధతిలో వ్యవహ రించాలన్నారు. మదనపల్లెలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై కేసులు బనాయించాలని, అరెస్టులు చేయాలని చూడడం విడ్డూరమని పేర్కొన్నారు. ఈనెల 9న జిల్లాలో నిర్వహింప తలపెట్టిన సమ్మెను విఫలం చేయాలని చూడడం అప్రజాస్వామికమన్నాఃరు. ఇప్పటికైనా ఎస్‌పి ప్రజలు, ప్రజాస్వా మ్యవాదులు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పోరాడే వారి పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, లేని పక్షంలో ప్రజలతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామంటూ అయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, సిపిఎం పట్టణ నేత మాధవయ్య,రైతు సంఘం నేత రామచంద్ర,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి నరసింహలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

**ప్రజాశక్తి- రాయచోటి అర్బన్**

వెంటనే 36 జిఒను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు 19 రోజులుగా చేస్తున్న నిరసన మంగళవారం కూడా కొనసాగాయి. దీక్షలలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, శంకరయ్య మాట్లాడుతూ పని గంటలు పెంచి కేవలం రూ.15 వేల వేతనం ఇస్తున్నారని తెలిపారు. పారిశుధ్య కార్మికులతో పాటు తమకు కూడా రూ.21 వేలు వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసాగించాలని చెప్పారు. లేనిచో పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని, రక్షణ పరికరాలతో పాటు నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలని కోరారు హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయకపోవడం కార్మికుల్ని దగా చేయడం కాదా? అంటూ ప్రశ్నించారు. పెరిగిన ధరలకను గుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ కొనసాగించాలని తెలిపారు. ప్రయివేట్ ఏజెన్సీలకిచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజల నుండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల ధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు బివి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

## 'పిఎం సూర్యఘర్'కు బ్యాంకులు సహకరించాలి

**ప్రజాశక్తి - రాయచోటి**

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం అమలులో బ్యాంకులు సహకరించాలని, జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రత్యేక క్యాంపుల ద్వారా జన్ ధన్ యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్ని బ్యాంకుల అధికారులను, జిల్లా అధికారులను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ లోనికి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధ్యక్షతన లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రత్యేక జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో జులై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు జరగబోయే ఆర్థిక ప్రచార కార్యక్రమాలను జిల్లా పంచాయతీ శాఖ అధికారితో సమన్వయం చేసుకొని ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక క్యాంపుల ద్వారా ప్రధానమంత్రి జన్ ధన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమ యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాల గురించి ప్రజలందరికీ తెలియజేసేలా చర్యలు తీసుకొని ఆర్థిక సమ్మిళితత్వాన్ని సాధించాలన్నారు. ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకంలో తెరవబడి, వాడుకలో లేని అకౌంట్లను తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు కోసం పంటల బీమా, ఎస్‌హెచ్‌జి రుణాలు, ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్తీ బిజిలి యోజన పథకాలపై అవగాహన కల్పించి ప్రజలందరూ వినియోగించుకు నేలా చేయాలన్నారు. పంటల బీమా పథకాలను రైతులందరూ వినియోగించు కునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్తీ బిజిలి యోజన పథకంపై సమీక్షిస్తూ బ్యాంకులు ఈ పథకానికి రుణాలు ఇచ్చేందుకు అమలు చేసే విధానాన్ని సరళీకృతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం ఆంజనేయులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కోటి రెడ్డి స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, ఎపిజిబి విజయవిహారి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## టెక్నీషియన్ల నియామకానికి దరఖాస్తులు

**ప్రజాశక్తి-రాయచోటి :** జిల్లాలో ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలలో నలుగురు టెక్నీషియన్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టుగా సిపిఒ వెంకట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వాసులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్‌కు సంబంధిత సబ్జెక్టుల్లో ఐటిఐ చేసి ఉండి నాలుగు సంవత్సరాల అనుభవం లేదా డిగ్రీ, డిప్లమా కలిగి ఉండి రెండు సంవత్సరాలు అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. పై అర్హత కలిగిన వారు తమ దరఖాస్తును అవసరమైన డాక్యుమెంట్లతో జతపరిచి సిపిఒ కార్యాలయం, కలెక్టరేట్‌లో ఈ నెల 12వ తేదీ లోపల సమర్పించాలని తెలిపారు.

## నేడు జిల్లా స్థాయి పోటీలు

**ప్రజాశక్తి - రాయచోటి**

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా క్లస్టర్ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన పెయింటింగ్, వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం రాయచోటి డైట్ విద్యా కేంద్రంలో ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పెయింటింగ్, మాదక ద్రవ్య దుర్వినియోగం, పొగాకు నివారణపై, లింగ సమానత్వంపై వ్యాస రచన పోటీలు ఉంటాయన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని 51 మండలాలలో ఉన్న క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ క్లస్టర్ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను సర్టిఫై చేస్తూ నిర్ణీత సమయానికి పోటీలకు పంపాలన్నారు.

## భారీ కణితిని తొలగించిన ప్రభుత్వ వైద్యులు

**ప్రజాశక్తి- రాయచోటి**

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మి ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ కణితిని తొలగించారు. శ్రీ సత్యసాయి జిల్లా నంబూల పూలికుంటకు చెందిన లక్ష్మున్నకు 40 సంవత్సరాలుగా వీపు వెనుక భాగంలో గుమ్మడికాయ ఆకారంలో కణితి పెరిగిపోయింది. ఈ కణితను తొలగించేందుకు పలు ఆసుపత్రులు తిరిగినా ఫలితం లేదు. చివరగా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి రావడంతో సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ పరిక్షించి వైద్యులతో చర్చించి ఆపరేషన్ చేసి కణితి తొలగించేందుకు చర్యలు చేపట్టారు. మంగళవారం సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ పాటు అనస్తీషియా వైద్యులు డాక్టర్ వెంకట శివ, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అజాజ్, స్టాఫ్ నర్సు సుప్రియ తదితరులు సుమారు 2 గంటల పాటు శ్రమించి ఆపరేషన్ విజయవంతం చేసి సుమారు 3 కిలోల కణితిని తొలగించారు. ఆపరేషన్ అనంతరం రోగి లక్ష్మన్న ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక అరుదైన శస్త్ర చికిత్సలు సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించి రోగుల, ప్రజల మన్ననలు పొందారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసు పత్రిలో భారీ కణితను తొలగించిన సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ వైద్య బృందం డాక్టర్ వెంకట శివ, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అజాజ్, స్టాఫ్ నర్సు సుప్రియలను రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.



తొలగించిన కణితిని చూపుతున్న వైద్యులు

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాశక్తి - రాయచోటి**

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన సురేష్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా తండ్రి రోసిరెడ్డి ఆర్థిక సహాయంతో చిత్తూరు రోడ్డు మార్గాన గుడిసెలలో నివసించే పేదలకు మంగళవారం అన్నదానం చేవారు. ఈ సందర్భంగా దాత రోసిరెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు సురేష్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతోనే గుడిసెలలో నివసించే పేదలకు అన్నదానం చేశానని చెప్పారు. రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా అధ్యక్షుడు లయన్ పి.శ్యామ్, వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పి.ఎస్ హరినాథ్ రెడ్డి, రీజనల్ ఛైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, ఉపాధ్యక్షుడు లయన్ వి.హరీష్ చంద్ర, మాజీ అధ్యక్షుడు లయన్ శివారెడ్డి, కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డిఇఒను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-రాయచోటి అర్బన్**

ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు తొత్తుగా వ్యవహరిస్తున్న డిఇఒ సుబ్రహ్మణ్యం వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ, రమణ డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం వారు డిఇఒను కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరిన తమ పట్ల డిఇఒ దురుసుగా వ్యవహరించారన్నారు. ముందు విద్యార్థి సంఘాల నాయకులను కార్యాలయంలోకి అనుమతించడమే తప్పు అంటూ ఆగ్రహించారన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా ఎక్కువ రేట్లకు పుస్తకాల మమ్ముతున్నారని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవాల్సింది పోయి తమపై బెదిరింపులకు దిగడం తగదన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను, పరిష్కరించమని ఎంఇఒలకు చెప్పాను అంటూ తప్పించు కుంటున్నారన్నారు. ఇప్పటికైనా డిఇఒ స్పందించి జిల్లాలో విద్యాహక్కు చట్టంను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ నేతలు ఆఫ్రిది, జయ బాబు సమీర్ వెంకట్ పాల్గొన్నారు.

## బిటి కళాశాలలో విచారణ

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

పట్టణంలోని బిటి కళాశాలలో మంగళవారం ఆర్‌జెడి ఉత్తర్వులు మేరకు సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, మహేశ్వరరావు, శ్రీనివాసులు, బ్రహ్మానందం బృందం విచారణ చేపట్టింది. 2022-2025 మధ్యకాలంలో బిటి కళాశాలలో జరిగిన అడ్మిషన్లు, కళాశాలకు వచ్చిన నిధులు, విద్యార్థులు చెల్లించిన ఫీజులు, ప్రభుత్వానికి జమ చేసిన బిల్లులు, వాటి ఖర్చులు తదితర వివరాలపై విచారణ చేపట్టి రికార్డులను పరిశీలించారు. 2022-25 మధ్యకాలంలో ఆనంద్‌రెడ్డి ప్రిన్సిపల్‌గా ఉన్న సమయంలో కొన్ని అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈ విచారణ కమిటీ కళాశాలకు వచ్చి రికార్డులను పరిశీలించారు. గతంలో ఆనంద్‌రెడ్డి చిత్తూరులోని పివికెఎం కళాశాలలో, పీలేరు గవర్నమెంట్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించారు. అక్కడ కూడా పలు అవకతవకలు జరిగాయని ముఖ్యంగా పివికెఎం కళాశాలకు పెద్ద ఎత్తున వచ్చిన రూస నిధులను పక్కదారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ కూడా ప్రత్యేక దర్యాప్తు బృందాలు వెళ్లి విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. కళాశాలలో మూడు రోజుల పాటు రికార్డులు పరిశీలించి, నివేదికను ఆర్‌జెడికి నివేదిస్తామని చెబుతున్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ లక్ష్మీనరసయ్య

## ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకం : డిఎంహెచ్ఒ

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

వైద్య రంగంలో ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమైనదని అన్నమయ్య జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఎన్‌జిఒహోమ్‌లో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనతను ఎలా అధిగమించాలి, కుటుంబ నియంత్రణ పద్ధతులు, ఆశా యాప్ నిర్వహించడంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గత నెలలో నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు, సైకిల్ సేల్ అనీమియా, మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, టిడి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిచారని చెప్పారు. అలాగే ఈనెల డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను ఆశా కార్యకర్తల సహకారంతో మరింత విజయం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రియాజ్ బేగ్, విష్ణువర్ధన్ రెడ్డి, యుపిహెచ్‌సి వైద్యులు రామచంద్రారెడ్డి, డిప్యూటీహెచ్ ఇఒ బలరామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాందేవ్‌కు భూములు అప్పగించొద్దు

### - సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

ఆహ్లాదకరమైన హార్సిలీహిల్స్ భూములను కార్పొరేట్లకు దోచిపెట్టి ప్రకృతి అందాలను ప్రజలకు దూరం చేయొద్దని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం హార్సిలీహిల్స్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ఊటీ హార్సిలీ హిల్స్‌ను నకిలీ మందులు అమ్ముకునే రాందేవ్ బాబాకు అప్పగించాలనుకోవడం చాలా దుర్మార్గమైన చర్యన్నారు. కమ్యూనిజం లేదు సోషలిజం లేదు టూరిజం ఒకటే అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు టూరిజంపైన నమ్మకం కోల్పోయావా అని ప్రశ్నించారు. రాందేవ్ బాబా కార్పొరేట్ సంస్థలకు సమానంగా ఎదిగాడని అతను నకిలీ కపట బాబా అని పేర్కొన్నారు. రాందేవ్ బాబాకు హార్సిలీహిల్స్ ఇస్తే అది అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా మారుతుందని తెలిపారు. జిల్లాలో నిరసన తెలపాలంటే ఆధార్‌కార్డులు సమర్పించాలనడం ఇది ప్రపంచంలో ఎక్కడా లేని చట్టాన్ని ఎస్‌పి తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, శివారెడ్డి, జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి పి.మహేష్, కార్యవర్గ సభ్యులు తోపు కృష్టప్ప, సాంబ, మురళి, మనోహర్‌రెడ్డి, నాయకులు బషీర్‌ఖాన్, అంజనప్ప, మాధవ్, వినయ్, సాయి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు రెడ్డి సాహెబ్, బహుజన్ సేన నాయకులు శ్రీచందు, మహేష్, మనోహర్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒలు

## 'మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్'ను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 10వ తేదీన అన్ని యాజమాన్య పాఠశాలలో, ప్రయివేట్ పాఠశాలలలో నిర్వహించవలసిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఇఒలు పద్మావతి, నారాయణ తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రమేష్ బాబు, తహశీల్దార్‌తపస్విని, ఎపిఒ రమేష్, ఎపిఎం మురళి, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ మిథున్ చక్రవర్తి, ఇతర మండల అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, ప్రయివేట్ పాఠశాలలో నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అధికారులకు కేటాయించిన పనులను దిగ్విజయంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. పాఠశాలలో చేపట్టవలసిన వివిధ పనులను ఇప్పటికే ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు తెలిపారు. విద్యా వ్యవస్థలో ఏర్పడిన సంస్కరణలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆట పోటీలను, వారి చేత ఉపన్యాసాలను, ప్రత్యేక ఆహ్వానితుల చేత ఉపన్యాసాలను నిర్వహించాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం ద్వారా పాఠశాలల్లోనే భోజనాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన పనులను ఏర్పాటు చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## యోగి వేమన అడుగుజాడల్లో నడవాలి


**ప్రజాశక్తి-కలికిరి**

రెడ్డి యువత సైరా నరసింహారెడ్డి, యోగి వేమారెడ్డి అడుగు జాడల్లో నడిచి సమాజ సేవకై కృషి చేయాలని రెడ్డి జెఎసి సంఘం అధ్యక్షుడు పులి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, ప్రజా కవి, యోగి వేమన విగ్రహాల స్థాపనకై సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణ అభివృద్ధిలో రెడ్డి సామాజిక బాధ్యతను పెంపొందించడంపై, యువతలో నాయకత్వ లక్షణాలను తీర్చిదిద్దడంపై చర్చించినట్లు తెలిపారు. సైరా నరసింహారెడ్డి స్వాతంత్ర్య పోరాటంలో తొలి తెలుగు నాయకుడిగా చరిత్రలో నిలిచారని అన్నారు. యోగి వేమన పద్యాలు సమాజంలో సమానత్వం, ధర్మం, విజ్ఞానాన్ని పంచాయి. వీరి విగ్రహాలు కలికిరిలో ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

చేయడం ద్వారా యువతకు ఆధ్యాత్మికంగా, దేశభక్తితో కూడిన స్ఫూర్తి లభిస్తుందని తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘం బలోపేతానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, సమాజంలోని అన్ని వర్గాలను సమ న్వయం చేస్తూ ఒక అఖిలపక్ష సమాఖ్యగా సంఘాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సాంస్కృతిక, విద్యా, సామాజిక, ఆర్థిక రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్ర మాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో లాయర్ రాంప్రసాద్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, చాకిరేపల్లి కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, రాజారెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ లోకవర్ధన్

## పిహెచ్‌సిల్లోనే ప్రసవాలు జరగాలి

**- ఎన్‌టిఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్**

**ప్రజాశక్తి-కలికిరి**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాలు జరిగేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని మేడికుర్తి పిహెచ్‌సిలో నిర్వహిస్తున్న ఆశా డేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా ఉన్న పిహెచ్‌సిలో ప్రతీ నెలా ప్రసవాలు జరిగేలా ప్రణాళికలు చేసుకుని రెండో, మూడో కాన్పు కేసులను పిహెచ్‌సిలో చేసేలా కృషి చేయాలని అన్నారు. రక్తహీనత, కుటుంబ నియంత్రణ, ఆశ యాప్‌లపై అజెండా ప్రకారం అవగాహన కల్పించి గత నెల ప్రగతిని ఆయన సమీక్ష చేశారు. కార్యక్రమంలో వైద్యులు కావ్య గంధ, పర్యవేక్షకులు, సిహెచ్‌ఒలు, ఎఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## పంటల బీమా రైతుకు ధీమా

**పులివెందుల రూరల్ :** పంటల బీమా రైతులకు ధీమా అని ఎం వి.చెన్నారెడ్డి సూచించారు. చిన్న రంగాపురంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్ర మంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం (పిఎంఎఫ్‌బివై) గురించి రైతులకు అవగాహన కల్పిం చారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమాకు సంబం ధించి రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను ప్రకటిం చిందన్నారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు బీమా చేసుకొనుటకు అనుమతి (నోటిఫైడ్) పొందిన పంటలకు ప్రీమియం చెల్లించాలని రైతులను కోరారు. **వేముల :** శేషన్నగారిపల్లి, బెస్తవారిపల్లి పం చాయతీల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఎఒ జిపి ఓబులేసు మాట్లాడుతూ పంటల ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. ప్రధాన పంటల్లో సస్యరక్షణ పద్ధతులు పాటించి, మంచి దిగుబడులు సాధించాలని కోరారు.

**మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి రాజంపేట వారి కోర్టులో**

**I.A. No : 263/2023**
**O.S. No :105/2023**

గొంది అమరేంద్రనాయుడు
గొంది సురేంద్ర నాయుడు ...**వాదులు**

**Vs**

**D3 :** సన్నపనేని సుబ్బమ్మ W/o. చెంగయ్య నాయుడు, వయస్సు 68, హిందూ, గృహిణి, నివాసం: డి.బి.ఎన్ పల్లె గ్రామం & పోస్టు, రాజంపేట (మం), అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్. ...**3వ ప్రతివాది**

**దావా సమను**

పై తెలిపిన వాదులు మీపై, మిగిలిన ప్రతివాదులపై Perminant injuction షెడ్యూల్ దాఖలా ఆస్థిపై కోరుతూ పై కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు. Interim injuction కోరుతూ I.A. No.263/2023 దావా దాఖలు చేసియున్నారు. ఇందుకుగాను మీకు ఏవైనా ఆక్షేపణలు ఉన్నాయెడల 17.07.2025 వ తేదీన ఉదయం 10:30 గంటలకు కోర్టు నందు హాజరై మనవి చేసుకొనవలయును. లేనంతట మీ పరోక్షమునందు తీర్మానించబడును.

**//By order of the Court//**
**NAGESWAR V. CHOWDARY,**
**వాదిపరం అడ్వకేట్,**
**రాజంపేట.**

# పండ్ల తోటల పెంపకంపై దృష్టి : డిఎల్‌డిఒ



కలకడ : మొక్కలు నాటే కార్యక్రమంలో డిఎల్‌డిఒ , గ్రామస్తులు

**ప్రజాశక్తి-కలకడ**

మండలంలోని రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని డిఎల్‌డిఒ లక్ష్మీపతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాతిగుంటపల్లి పంచాయతీలో హార్టికల్చర్లపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డిఎల డిఒ, రాతకుంటపల్లి సర్పంచ్ అలివేలమ్మ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతు పండ్ల తోటలను పెంచడంపై మక్కువ చూపి విరివిగా మామిడి సపోటా, నారింజ, బొప్పాయి, నేరేడు వంటి పండ్ల తోటలను పెంచాలని రైతులకు సూచించినట్లు తెలిపారు.రాతిగుంటపల్లి పంచాయతీలో రైతు రెడ్డప్ప పొలంలో మామిడి చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పండ్ల తోటలు పెంపకానికి రైతులకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కలను సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. వాటి సంరక్షణకు కావలసిన సొమ్మును రాష్ట్ర కేంద్ర, ప్రభుత్వాలు అందిస్తాయని తెలిపారు. మండలం లోని ప్రతి రైతు పండ్ల మొక్కలు పెంపకంపై ఆసక్తి చూపి మరిన్ని పండ్ల మొక్కలను నాటేందుకు మండల స్థాయి అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, నాయకులు మల్లికార్జున్ నాయుడు, వసంత నాయుడు, కమలనాథ, ఎంపిడిఒ భాను ప్రసాద్, ఎపిఒ సుజాత, ఇసి నాగవేణి, టెక్నికల్ అసిస్టెంట్ నవీన్ కుమార్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్, పివి.నాయుడు, జనార్ధన్‌నాయుడు, ఆనంద నాయుడు మేట్స్, రైతులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహా యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండలం ఇన్‌ఛార్జి యనమల మదన్‌మోహన్ పేర్కొన్నారు. మండలంలోని దిన్నపాడు గ్రామంలో ఎపిఒ మురళి తో కలిసి రైతుల పొలంలో మామిడి మొక్కలు నాటి కూటమి ప్రభుత్వంలో రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు, రాష్ట్ర నిధులు జోడించి అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే రైతుల ఖాతా లలో జమ చేయడం జరుగుతుందిని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని రైతులు సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర రవాణా,యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి రైతుల అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. రైతు లందరూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకం చేపట్టి ఆర్థిక అభి వృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంల బిసి సభ్యులు జయరామ్, వై.ధర్మ రాజు, లక్ష్మి రాజు, నరసరాజు, దేవానందరెడ్డి, సిద్ధక వెంకట్రాంరెడ్డి, ఎపిఒ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ పీరయ్య, వెంకటరాజు, కృష్ణంరాజు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు. **కలికిరి :**పండ్ల తోటలతోనే రైతులకు నికర ఆదాయం లభిస్తు ందని ఎపిడి ఎన్ .శీనివాసులు తెలిపారు. మండలంలోని మర్రికుంటపల్లి పంచాయతీలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సుస్థిర - స్థిరమైన ఆర్థికాభివృద్ధికి రైతు పొలంలో పండ్ల తోటల పెంపకం కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ద్వారా 100 ఏకరాలలో పండ్ల తోటల పెంపకం కార్యక్రమం నిర్వహించారు. మర్రికుంటపల్లె గ్రామ పంచాయతీ బయ్యారెడ్డిగారిపల్లి గ్రామంలో ఆనంద్ ఒడ్డి వ్యయసాయ పొలంలో మామిడి, టెంకాయ చెట్లను అధికారులు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలను నాటుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ మంజుల, ఎంపిడిఒ భాను ప్రకాష్‌రావు, మర్రికుతపల్లి సర్పంచ్‌రెడ్డి రామ్, ఆనందరెడ్డి, రైతులు పాల్గొన్నారు. **నందలూరు:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల చెట్లు నాటే కార్యక్రమాన్ని పాటూరు గ్రామపం చాయ తీలో నిర్వహించారు. ఎంపిపి విజయభాస్కర్ రెడ్డి పాల్గొని చెట్లు నాటారు. కార్యక్ర మంలో ఎంపిడిఒ రాధా కృష్ణన్, ఎపిఒ మురళి, మండల కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లాఖాన్, మోహన్‌రెడ్డి, ఓర్సు శ్రీనివాసులు, విజయుడు పాల్గొన్నారు.**రైల్వేకోడూరు :** పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని టిడిపి ఇన్చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లా నీటి యాజమాన్య సంస్థ సహకారంతో మండలంలోని ఓబనపల్లె పంచాయతీ బయనపల్లె గ్రామంలో పండ్ల మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానంద రెడ్డి మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ప్రజలు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నాగార్జున రావు, ఎపిఒ మృత్యుంజయరావు, టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, టివి.రమణారెడ్డి పాల్గొన్నారు.



రైల్వేకోడూరు : మొక్కలు నాటుతున్న ముక్కా రూపానందరెడ్డి

# ఏడాది పాలనలోనే హామీలు అమలు : ఎమ్మెల్యే



ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

రాష్ట్రంలో ప్రజల జీవితాలలో కూటమి ప్రభుత్వం సంతోషాలను నింపుతోందని, ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం మండలం లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, మాజీ జడ్‌పిటిసి సుజాత, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ప్రదీప్‌సింగ్ కూటమి నాయకులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది కూటమి పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను చేసిన అభివృద్ధిని ఆయన వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం, దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు లబ్ధి పొందిన మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పింఛన్లను రూ.4వేలకు పెంచి ఇస్తున్నామని అన్నారు. రైతులకు త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు డిఎస్సిఐ ద్వారా 16 వేలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలను కల్పించబోతున్నట్లు వివరించారు. రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పల్లె పండుగ ద్వారా ప్రతి గ్రామంలోనూ సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు,తాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి ప్రజాధనాన్ని వైసిపి నాయకులు దోచుకెళ్లారని అన్నారు. భవిష్యత్తులో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు, సర్పంచు ఎన్నికలలో కూటమి పార్టీల నాయకులు కలసికట్టుగా ఉంటూ అఖండ విజయాలను సాధించాలని తెలిపారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ప్రభుత్వం ద్వారా మహిళలకు ఇస్తున్న టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని తనిఖీ చేసి, టైలరింగ్ శిక్షణను శ్రద్ధగా నేర్చుకొని మహిళలు తమ కుటుంబ అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గంగాపురంపల్లి వద్ద రైతు విజయ్‌కుమార్ వ్యవసాయ పొలంలో ఎంజీఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకము ద్వారా పండ్ల తోటల పెంపకానికి మంజూరైన మామిడి మొక్కలను నాటారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాకాలను అందిస్తోందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడానికి నాయకులంతా కలసికట్టుగా ఉంటూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డప్పరెడ్డి, మాజీ మండలాధ్యక్షులు రాజన్న, క్లస్టర్ ఇంచార్జ్ మునిరత్నం, తెలుగు యువత మండలాధ్యక్షులు చిన్నబాబు, మల్లికార్జున, సుధాకర్‌రావు, శ్రీపతి, సర్పంచులు పాపులమ్మ మల్లప్ప, మధు, శ్రీవాణి నవీన్, జనసేన పార్టీ నాయకులు అఫ్రోజ్ ఖాన్, తహశీల్దార్ తపస్విని, ఎంపిడిఒ రమేష్‌బాబు, ఎంఇఒలు పద్మావతి, నారాయణ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్‌ఆర్ జయంతి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి సందర్భంగా మండలం లోని తుమ్మణంగుట్ట గ్రామంలో వైసిపి నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలవేసి కేక్‌కట్ చేసి పంపిణీ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిసి అధ్యక్షులు ఉజ్జయిని సాంబశివ, నియోజవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు నేరెళ్ల రెడ్డి హరి, గొల్లపల్లి సర్పంచ్ పుష్పలత విజయభాస్కర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **కలకడ:** స్థానికబస్టాండ్ ఆవరణంలో వైసిపి మండల అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు మస్తాన్ అహ్మద్ ల ఆధ్వర్యంలో వైఎస్ జన్మదిన వేడుకలను నిర్వహించిన తెలిపారు బస్టాండ్ ఆవరణంలో ఉన్న వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, మోహన్ రాజానాయుడు, కిషోర్ కుమార్, శావత్ అలీ జిలానీబాషా పాల్గొన్నారు. **కలికిరి:** స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న వైఎస్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించినారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంచినారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపిపి నూర్జహాన్, రత్న శేఖర్‌రెడ్డి, హనీఫ్, సర్పంచులు గంగయ్య, బాబు రెడ్డి, ఎస్‌సి సెల్ కార్యదర్శి వి.హరి, మధు రెడ్డి, బావాజీ, ఫయాజ్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో వైఎస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి, కేక్ కట్ చేసి, ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ మీనాకుమారి, మహబూబ్ పీర్, ఈశ్వరమ పాల్గొ న్నారు. **రక్తదానం శిబిరం..** మదనపల్లె యూత్ వింగ్ అధ్యక్షులు హర్ష ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి నిసార్ అహ్మద్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపినాయకులు, కౌన్సిలర్ నరి బాబాయ్, పవన్‌తేజ్, మల్లికార్జున రెడ్డి, సహదేవ పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండలంలోని చిన్న ఓరంపాడు క్రాస్ రోడ్డు గల వూఊవైసవిగ్రహానికి మండల కన్వీనర్ కొత్తలూరు సాయి కిషోర్ రెడ్డి, రాయలసీమ జోనల్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరు గూడూరు గౌరీ శంకర్రాజు, సర్పంచులు ఎన్.పి జైపాల్ రెడ్డి, మల్లెం ఈశ్వరయ్య , సుంకేసుల రఫీ, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.**రామాపురం :** మండల కేంద్రంలో వైఎస్‌ఆర్ విగ్రహానికి ప్రముఖ వైద్యులు బయారెడ్డితో కలసి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెస్కోమాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, మాజీ ఎంపిపి ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్‌లు నాగభూషణ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **గాలివీడు :** స్థానిక బస్టాండ్ ఆవరణంలో వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద వైసిపి నాయకులు నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి-1మిట్టపల్లి యదు భూషణరెడ్డి, వైస్ ఎంపిపి2 గాలి శ్రీనివాసులు, ఆవుల నాగభూషణ రెడ్డి, ఎస్‌కె.ఖాదర్ మోదిన్, సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు:** స్థానిక బస్టాండ్ కూడలిలోని ఎంపిపి మేడా విజయభాస్కర్ ఆద్వర్యంలో వైఎస్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూల మాలను వేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. **వాల్మీకిపురం:** దివం గత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల వద్ద వైఎస్‌ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, వైసిపి నాయకులు నీళ్లభాస్కర్, బిడ్డల కేశవరెడ్డి, అబ్దుల్ కలీం, రవీంద్ర రెడ్డి, చింతల శివానందరెడ్డి, రాజాబాబు, మహేష్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

# మంజూరైన సబ్ స్టేషన్ల పరిస్థితి ఏమిటీ ?

**-కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వైసిపి**

**ప్రజాశక్తి-తంబళ్లపల్లె**

గతంలో తంబళ్లపల్లె నియోజకవర్గానికి మంజూరైన సబ్ స్టేషన్ల పరిస్థితి, నిధుల మాటేమిటో కూటమి ప్రభుత్వం వెల్లడించాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి జయసింహారెడ్డి డిమాండ్ చేశారు.మంగళవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నియోజక వర్గంలోని గృహ వినియోగదారులు లోఓల్టేజీ సమస్యతో ఎదురువుతున్న ఇబ్బందులపే గుర్తించిన ఎమ్మెల్యే అప్పటి విద్యుత్‌శాఖ మంత్రిగాపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి 13 సబ్ స్టేషన్లను మంజూరు చేయించారని అన్నారు. ఒక్కో సబ్ స్టేషన్‌కు రూ.1.51 కోట్లు చొప్పున ఆరు సబ్ స్టేషన్లు నిధులు మంజూరు చేసి టెండర్లు ఖరారు చేశారన్నారు. ఎమ్మెల్యే వాటికి శంకుస్థాపన చేశారని, అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకున్న పాపన పోలేదన్నారు. సబ్ స్టేషన్ల పరిస్థితిపై ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, ఎంపిటిసి మహేష్, నాయకులు సుధాకర్డ్డి, భాస్కర్రెడ్డి, కరీమ్, శ్రీరాములు, కోటిరెడ్డి, శివారెడ్డి, కరీముల్లా, చలపతి, రామమూరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయసింహారెడ్డి




రైతులకు సూచనలు డిఎఒ శివ నారాయణ

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి : డిఎఒ

**ప్రజాశక్తి-వీరబల్లి**

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని ఓదివీడు పంచాయతీలో ఎఒ స్వాతి ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎఒ ముఖ్య అతిథిఆ పాల్గొని మాట్లాడారు. పంటల్లో ఆశించే చీడపీడల నివారణకు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులను వినియోగించకూడదని సూచించారు. అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ పెట్టుకోవచ్చని రైతులకు తెలిపారు. జూలై 15 వ తేదీ వరకు వరి, వేరుశనగ వేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ రెండు పంటలకు జులై 15 లోపల ఇన్సూరెన్స్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ డివిజనల్ అధికారి విజయ రాణి, డిఆర్‌సి వ్యవసాయ అధికారి ప్రభావతి, ఎఒ స్వాతి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందిస్తున్న మల్లికార్జునరెడ్డి

## పారదర్శకంగా టిడిపి కమిటీల నియామకం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

పట్టణంలో వార్డు కమిటీల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు మదనపల్లె సంస్థాగత ఎన్నికల పరిశీలకులు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 31వ వార్డు కమిటీల నియామకానికి సంబంధించి సమావేశాన్ని నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు పచ్చిపాల రామకృష్ణ ఆచారి ఆధ్వర్యంలో కమిటీల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచనలు, సీనియర్ నాయకుల సలహాల మేరకు వార్డులలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి, స్థానిక టిడిపి నాయకుల అభిప్రాయం మేరకు కమిటీలలో చోటు కల్పిస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీలో నిస్వార్థంగా పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. సమన్వయంతో పనిచేసి అన్ని వార్డులలో కమిటీలను విజయవంతంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గంగారపు రామ్మూర్తినాయుడు, వల్లిగట్ల వెంకటరమణ,యర్రబల్లి వెంకటరమణారెడ్డి, బొమ్మిశెట్టి పురుషోత్తం, కోన భాస్కర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నాదెండ్ల అరుణ్ తేజ్, పురుషోత్తం పాల్గొన్నారు.



పశు గ్రాస పెంపుదల గురించి వివరిస్తున్న గుణశేఖర పిళ్ళై

## ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

**ప్రజాశక్తి-నందలూరు**

రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్ళై పేర్కొన్నారు. ఈనెల 7 నుంచి 14 వ తేదీ వరకు జరుపబడు పశు గ్రాస వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాటూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పశుగ్రాస పెంపుదల, పశుగ్రాసాలలో బహు వార్షికాలు గడ్డి గురించి వాటి ప్రాము ఖ్యత , మెలకువల గురించి వివరించి చెప్పారు.కార్యక్రమంలో రాజంపేట ఉపసంచాలకులు డాక్టర్ విజయభాస్కర్‌రావు, రాజంపేట సహాయ సంచాల కులు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ లోకేష్ , నందలూరు పశువైద్యులు డాక్టర్ ఈశ్వర ప్రసాద్, డాక్టర్ మాధవిలత , జెవిఒలు సుగుణ, గంగులయ్య, వి.ఎ. సుదర్శన్ రెడ్డి, ఎహెచ్‌ఎలు జాహ్నవి, శ్రీనాథ్, సుస్మిత, శివరాం గులాబ్ జాన్ పాల్గొన్నారు.

## ఆదాయ వనరులపై దృష్టి సారించండి

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

పంచాయతీ పరిధిలో ఆదాయ వనరులపై దృష్టి సారించాలని ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో పంచాయతీ పురోగతి సూచిక వర్షన్ 2.0 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. మెడికల్ ఆఫీసర్ కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. అంతకుముందు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఒ కల్యాణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

## ఉచితంగా హిందీ మెటీరియల్ పంపిణీ

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని బావికాడిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా హిందీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించడానికి సన్నద్ధం కావాలని సూచించారు. హిందీ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి 90 పైగా మార్కులు సాధించాలన్నారు. ప్రతిఏటా పదవ తరగతి విద్యార్థులు తన సొంత డబ్బుతో ఉచితంగా మెటీరియల్ అందజేస్తున్న హిందీ ఉపాధ్యాయుడును అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామిరెడ్డి, మోహన్,మనోహర్ పాల్గొన్నారు.



హిందీ మెటీరియల్ చూపుతున్న విద్యార్థులు